క్లుప్తంగా

దీపావళి పనులు షురూ!



మద్నూర్(జుక్కల్): దీపావళి పండుగ సమీపిస్తుండటంతో మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలు, ఇళ్లకు గ్రామస్తులు పెయింటింగ్‌లు వేసుకుంటున్నారు. మరో వారం రోజుల్లో దీపావళి ప్రారంభం కానుండడంతో వ్యాపారస్తులు తమ దుకాణాలను శుభ్రం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో దీపావళి పండుగను ప్రజలు మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం ఐదు రోజులు పాటు నిర్వహిస్తారు. మండల కేంద్రంలోని మార్వాడీ గల్లీలో మర్వాడీలు ఇళ్లకు ముస్తాబు చేసుకుంటుండటంతో పండగ సందడి మొదలైంది.

కొయ్యగుట్టలో ఇంటింటా ఫ్లెక్సీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్టలో పలువురు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభిమానులు తమ ఓటు పోచారం శ్రీనివాస్‌రెడ్డికే ఇతరులు ప్రచారానికి రావద్దంటూ ఇంటి గోడలకు ఫ్లెక్సీలు కట్టారు. గత ఎన్నికల్లోనూ తాము పోచారం శ్రీనివాస్‌రెడ్డికే ఓటేశామని, ఈసారి కూడా మా కుటుంబం మొత్తం ఓట్లు ఆయనకే వేస్తామని ఫ్లెక్సీల ద్వారా తెలుపుతున్నారు. గ్రామానికి చెందిన అఫ్రోజ్, పండరిగౌడ్, శివవ్వ, శ్యామల తమ ఇళ్లకు ఫ్లెక్సీలు కట్టుకున్నారు.

చెక్కులు అందుకున్న సోలార్ వినియోగదారులు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ క్యాంపులో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పలువురి ఇళ్లపై సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వారు కరెంటు వాడుకోగా మిగిలిని కరెంటును డిస్కమ్‌లకు అమ్మారు. దీంతో అమ్మిన కరెంటుకు సంబంధించి శుక్రవారం చెక్కులు వచ్చాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకట రమణ మాట్లాడుతూ.. గ్రామంలో 13 మంది సోలార్ విద్యుత్ వినియోగిస్తున్న వారికి, అమ్మిన విద్యుత్‌కు సంబంధించిన రూ.1.50 లక్షల చెక్కులు అందాయన్నారు. జిల్లా కో–ఆప్షన్ మెంబర్ మాజిద్ ఖాన్, తదితరులున్నారు.

స్పీకర్‌కు మద్దతు



బాన్సువాడ: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి తిర్మలాపూర్ మాదిగల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని, కులస్తులు ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్మానంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జిన్న రఘురామయ్య, ఎంపీటీసీ మల్లారెడ్డి, మాదిగ కులస్తులు మ్యాతరి శంకర్, మౌనిక,గంగారం, తులశవ్వ, సవిత, సాయికిరణ్, సంధ్య, రమేష్ తదితరులున్నారు.

ఫిజియోథెరపి క్యాంప్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 9 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి చేశారు. అనంతరం ఇంటి వద్ద చేపించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. ఆరుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఒక్కరికి లుకుమా ఉన్నట్లు గుర్తించి నిజామాబాద్ కంటి ఆస్పత్రికు రిఫర్ చేశారు. 18 మందికి కంటి అద్దాలు రిఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, లయన్స్ క్లబ్ సభ్యులు బెజుగం చంద్రశేఖర్, మర్గల వేణు, సంతోష్, రాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

‘వడ్డేపల్లి’ బల ప్రదర్శన

- బీజేపీలో చేరిన తర్వాత కాలభైరవుడిని దర్శించుకున్న సుభాష్ రెడ్డి
- భారీ కాన్వాయ్‌తో రామారెడ్డిలో ర్యాలీ



గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు, వడ్డేపల్లి వర్గీయులు

రామారెడ్డి: ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరిన వడ్డేపల్లి సుభాష్ రెడ్డి శుక్రవారం రామారెడ్డిలో భారీ బల ప్రదర్శనకు దిగారు. సుమారు 200 కార్లతో ఊరేగింపుగా కాలభైరవుడి ఆలయానికి వచ్చిన వడ్డేపల్లి సుభాష్ రెడ్డికి బీజేపీ శ్రేణులు, సుభాష్‌రెడ్డి వర్గీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద శివాజీ విగ్రహానికి పూలమాల వేసి భారత్ మాతాకీ జై నినాదాలతో మార్మోగించారు. భారీ కాన్వాయ్‌తో రామరెడ్డిలోని ప్రధాన రోడ్డు కిక్కిరిసిపోయింది. స్థానిక బీజేపీ నేతలు క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. భారీగా కార్యకర్తలు, అభిమానులు హాజరు కావడం, భారీ బలగంతో ర్యాలీ నిర్వహించి ఎల్లారెడ్డిలో అసెంబ్లీ ఎన్నికలను సుభాష్‌రెడ్డి మరింత రసవత్తరంగా మార్చారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, స్థానిక నేతలు ప్రసాద్, నర్సింలు, పందుల గోపి, ఇసాయిపేట నరేష్, సుభాష్ రెడ్డి కుటుంబీకులున్నారు.

ఎల్లారెడ్డిలో ఘన స్వాగతం



నాగిరెడ్డిపేట నుంచి వెళ్తున్న బీజేపీ శ్రేణులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీజేపీ తీర్థం పుచ్చుకుని మొదటి సారిగా ఎల్లారెడ్డికి విచ్చేసిన బీజేపీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. మండలంలోని మాచాపూర్‌శివారులో ఆయనకు పూల మాలలు వేసి మండలంలోకి ఆహ్వానించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

భిక్కనూర్ టోల్‌ప్లాజాకు తరలిన బీజేపీ నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన తర్వాత ఢిల్లీ నుంచి నేరుగా జిల్లాకు వస్తున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి స్వాగతం పలకడానికి నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నేతలు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో వారు బీజేపీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో భిక్కనూర్‌కు తరలివెళ్లారు.

భారీ మెజార్టీతో అభివృద్ధికి బాటలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్‌ను ఎంత మెజార్టీతో గెలిపిస్తే అంత అధిక స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శుభం కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్క బూత్ స్థాయి నాయకుడు మెజార్టీపై దృష్టి పెట్టి ఓట్లను కూడగట్టాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి చోటు ఇవ్వకుండా పనిచేయాలని సూచించారు. కార్యకర్తల సత్తా ఏమిటో చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన బ్లూటూత్ ప్రింటర్ ఉపయోగంపై శిక్షణ ఇచ్చారు. గతంలో ఓటర్‌కు బూత్ స్లిప్పులను చేతి రాతతో అందజేసేవారని అన్నారు. ఇకపై బ్లూటూత్ ప్రింటర్ ద్వారా ఓటర్లకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నోటీసు ప్రచురణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అసెంబ్లీ ఎన్నికల నోటీసును శుక్రవారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రఘు ప్రచురించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసును ప్రచురించామని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, 13న నామినేషన్ల పరిశీలన, 15లోపు నామినేషన్లను విత్ డ్రా చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ నెల 30న పోలింగ్, వచ్చేనెల 3న కౌటింగ్ జరుగుతుందన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



గిర్నితండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో గ్రీష్మ



గుండారంలో ..

నిజాంసాగర్(జుక్కల్):కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని క్లస్టర్ ఏఈవో గ్రీష్మ సూచించారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని గిర్నితండా జీపీలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు.

రాజంపేట: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్గొండ సొసైటీ సీఈవో వెంకటేశ్వర శర్మ అన్నారు. శుక్రవారం ఆర్గొండ సొసైటీ పరిధిలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్ధాపూర్ గ్రామాలలో వరి కొనుగోలు సెంటర్లను ఆయన ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపావద్దన్నారు. ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ అన్నారు. బ్రాహ్మణపల్లిలో శుక్రవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సింగిల్ విండో కార్యదర్శి నర్సింలు, సిబ్బంది నితిన్ రెడ్డి, బాలకిషన్ పాల్గొన్నారు.



తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లిలో..

నిబంధనల ప్రకారమే పనులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పనులు చేపట్టిన కూలీలు నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. ఆత్మకూర్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. కూలీలు కొలతల ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

సమాచారం..

నేడు బాన్సువాడలో కబడ్డీ జట్ల ఎంపిక

బాన్సువాడ: పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో శనివారం అండర్–17, అండర్–14 బాలుర, బాలికల విభాగంలో కబడీ జట్లను ఎంపిక చేయనున్నట్లు పీఈటీ తారచంద్ తెలిపారు. మండల స్థాయి, జోనల్ స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలుర, బాలికల జట్లను ఎంపిక చేస్తామని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఏడుగురు చొప్పున టీం సభ్యులు బోనాఫైడ్ తీసుకుని రావాలని అన్నారు. ఉదయం 10 గంటల లోపు విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

10న మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట: ఈ నెల 10న రాజంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో బాలకిషన్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీస్ పరీక్షల పరిశీలన



లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలలో సీస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న నోడల్ అధికారులు

లింగంపేట/కామారెడ్డి రూరల్/నిజాంసాగర్: కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించడానికి ఏర్పాటు చేసిన సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న సీస్(ఎస్ఈఏఎస్) పరీక్షలను శుక్రవారం నోడల్ అధికారులు షౌకత్ అలీ, కోటేశ్వర్‌రావులు పరిశీలించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకొని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాలు ఎంత వరకు చేరుకున్నారో అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు రాష్ట్రంతో పాటు దేశంలో మొత్తం ఒకే రోజు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. లింగంపేట మండలంలోని 30 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు మాత్రమే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని 28 ఆయా పాఠశాలల్లోని 3,6,9 తరగ తుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన పరీక్షలను నోడల్ అధికారి అమర్‌సింగ్ పరిశీలించారు. అలాగే కామారెడ్డి మున్సిపల్‌పరిధిలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించగా.. అధికారులు పరిశీలించారు.



నిజాంసాగర్‌లో.. నోడల్ అధికారి అమర్‌సింగ్



దేవునిపల్లి పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఉన్నత పాఠశాలల సందర్శన



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు బస్వాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర ఉన్నతి కార్యక్రమం పరిశీలకులు శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర పరిశీలకులు ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, రవికాంత్‌రావు, అర్జున్‌లు భిక్కనూరు, బస్వాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలన పరిశీలించి పాఠశాలలో ఉన్నతి కార్యక్రమం అమలు తీరు గురించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. వారి వెంట హెచ్ఎం శ్రీనాథ్ విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వలస వచ్చేవారిని నమ్మొద్దు

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



బేగంపూర్‌లో ఎమ్మెల్యే సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వలస వచ్చేవారిని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. తాను ఈ ప్రాంతానికి చెందిన వాడినని, మళ్లీ సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. శుక్రవారం కాటేపల్లి, కాటేపల్లి తండా, బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, పెద్ద దేవిసింగ్ తండా , కుబ్యా నాయక్ తండాలలో సింధే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బేగంపూర్‌లో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కాండువ కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హన్మంత్ సింధే మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఒకరు నిజామాబాద్, మరొకరు సంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన వలసవాదులని పేర్కొన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిలిండర్ రూ.400లకే అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు విజయ్ దేశాయ్, బిచ్కుంద మార్కుట్ కమిటి చైర్మన్ ఖండేరావు, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింధేకు నిరసన సెగ



కాటేపల్లిలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మా గ్రామంలో అభివృద్ధి ఎక్కడ ఉందని కాటేపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే హన్మంత్ సింధేను నిలదీశారు. శుక్రవారం కాటేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే సింధేను గ్రామస్తులు నిలదీశారు. ఎస్సీవాడలో రోడ్లు, మురికి కాలువలు లేవని, దళిత బంధు, బీసీ, మైనారిటీ బంధులు ఎక్కడని యువకులు ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎక్కడ ఇచ్చారు.. ముడు రోజుల నుంచి తాగడానికి నీళ్లు లేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు.

ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేస్తా

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కారు గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేసుకుంటానని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట, చీనూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గోపాల్‌పేటలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు స్థానికంగా ఉండడని, తాను నియోజకవర్గంలోనే ఉండి ప్రజలకు సేవచేసుకుంటానన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్దయ్య, నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన 50 మంది వివిధ పార్టీలకు చెందిన యువకులు శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పెసరి సాయిలు, కుర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్కంటి బుచ్చన్న, జిల్లా కో–ఆప్షన్‌మెంబర్ సయ్యద్ మోహినొద్దిన్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించే వారికే మద్దతు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఉచిత విద్య, వైద్యం అందించే వారికే తమ పార్టీ మద్దతుగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని ఇతర పార్టీలను డిమాండ్ చేశారు. నాయకులు మోతిరాం నాయక్, ప్రదీప్ తదితరులున్నారు.

రిటర్నింగ్ కార్యాలయం వద్ద బందోబస్తు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు. వంద మీటర్ల పరిధిలో ఎవరూ ఉండకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ఉచిత హామీలు నమ్మొద్దు



కామారెడ్డి టౌన్: మండలంలోని పాత రాజంపేట్, చిన్న మల్లారెడ్డి గ్రామాల్లో శుక్రవారం బీఎల్ఎఫ్ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఎల్ఎఫ్ అభ్యర్థి సిరిగాద సిద్దిరాములు సతీమణి సబిత గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. బహుజనుల రాజ్యం రావాలంటే బీఎల్ఎఫ్‌ను గెలించాలని ఓటర్లను కోరారు. ఉచిత హామీలు, మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మొద్దని చెప్పారు. కార్యక్రమంలో నేతలు ఆంజనేయులు, గంగామణి తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల వివిధ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ(తెలంగాణ) జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ట్రెజరీ అధికారి జి.సాయిబాబును కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గత నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సాంకేతిక కారణాలతో వేతన బిల్లులు చెల్లించలేదని, సప్లిమెంటరీ బిల్లులను రెగ్యులర్ బిల్లులతో మంజూరు చేయాలని నాయకులు కోరారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు కంది మల్లేష్, కార్యకర్తలు ఖలీల్, సాయి కుమార్, సాయిలు, అస్కర్ అలీ, మోసిన్, చాకలి సాయి, ఫయాజ్, అర్షద్ తదితరులు ఉన్నారు.

